నేడు డయల్ యువర్ డీఎం

మెహిదీపట్నం ఫిబ్రవరి 16 : మెహిదీపట్నం డిపో ప్రాంత ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి సూచనలు, సలహాల గురించి, ప్రయాణికుల అభిప్రాయాలను తెలుసుకొనుటకు, సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మెహదీపట్నం డిపో మేనేజర్ నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 11:00 నుంచి 12:00 గంటల వరకు సూచనలు సలహాలు తెలియజే యాలని ఒక ప్రకటనలో డిపో మేనేజర్ బి. వీ. కే. మూర్తి తెలిపారు. ఈ ఫోన్ నం. 9959226133 సంప్రదించాలని సూచించారు.

పొంచిఉన్న ప్రమాదం

ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్, బడా గణేశ్ లేన్‌లో నిర్మించిన బాక్స్ డ్రైన్ మూతను నిర్లక్ష్యంగా జీహెచ్ఎంసీ సిబ్బంది తెరిచి ఉంచారు. భారీ వర్షాలు పడినప్పు డు వరద నీరు నిలువ ఉండకుండా వెసులుబాటుగా జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఈ బాక్స్ డ్రైన్ నిర్మించారు. లక్షలాది రూపాయలు వెచ్చించి కట్టిన ఈ బాక్స్ డ్రైన్‌లో సుమారు 20 నుంచి 30 అడుగులకు పైగా లోతు ఉంటుంది. నిర్లక్ష్యంగా తెరిచి ఉంచడం వల్ల అందులో జంతువులతో పాటు ప్రమాదవశాత్తు మనుషులు పడితే గుర్తించడం కూడా కష్టమే. తక్షణమే బాక్స్ డ్రైన్ మూతను మూసివేయాలని స్థానికులు కోరుతున్నారు.

– ఖైరతాబాద్, ఫిబ్రవరి 16

అలరించిన నృత్య ప్రదర్శన

సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో కూచిపూడి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీయ వర్మ మండూక శబ్దం, మరకత మణిమయను ప్రదర్శించి మెప్పించగ, లలిత ధనలక్ష్మి గొల్లపల్లి శిష్య బృందం వినాయక కౌతం, బ్రహ్మాంజలి, జతిస్వరం, మూషిక వాహన, శ్రీ శారదాంబ , చేరి యశోదకు, స్వరజతి, గరుడ గమన, లలిత హారతి నృత్య రూపంలో ఐశ్వర్య, నిత్య, తన్మయి ప్రదర్శన తీరు ఆకట్టుకున్నాయి. – కొండాపూర్

రోడ్డు తవ్వి 4 నెలలైంది

- ఇంకా చేపట్టని పనులు
- అవస్థలు పడుతున్న మల్లికార్జుననగర్ వాసులు
- పనులు చేపట్టాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు

మల్లికార్జుననగర్‌లో తవ్వి వదిలేసిన రోడ్డు

అంబర్‌పేట, ఫిబ్రవరి 16: పాత రోడ్డు పాడైపోయిందని... కొత్త రోడ్డు వేస్తామన్నారు. రోడ్డును తవ్వి నాలుగు నెలలు గడుస్తున్నది. అయినప్పటికీ కొత్త రోడ్డు వేయలేదు. దీంతో బస్తీవాసులకు నరకం అనభవిస్తున్నారు. అయిన అధికారులు పట్టించుకున్న పాపాన పోవడంలేదని మల్లికార్జున నగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేపు, మాపు అంటూ కాలయాపన..

రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కానీ రోడ్డు నిర్మాణం మాత్రం చేపట్టడం లేదు. ఇలాంటి పరిస్థితి బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జుననగర్‌లో చోటుచేసుకుంది. బస్తీవాసుల కోరిక మేరకు నాలుగు నెలల క్రితం ఇక్కడ కొత్త రోడ్డు వేయడానికి పనులు ప్రారంభించారు. పాత రోడ్డును పూర్తిగా తవ్వారు. స్థానిక కమ్యూనిటీ హాల్ ముందు నుంచి చివరి వరకు, మల్లికార్జుననగర్ టెంపుల్ వెనుక రెండు లేన్లు మొత్తం తవ్వారు. కానీ కొంత భాగమే రోడ్డును నిర్మించారు. మిగతా రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. దీంతో బస్తీవాసులకు కొత్త ఇబ్బందులు వచ్చాయి. తవ్విన రోడ్డుతో రాత్రిపూట బయటకు వెళ్లలేకపోతున్నారు. ఇటీవల ఒకరు కిందపడి గాయాలపాలయ్యారు. రోడ్డును తవ్వగా డ్రైనేజీ పూర్తిగా జామ్ అయింది. ప్రతిరోజూ డ్రైనేజీ మురుగు పొంగిపొర్లి దుర్వాసన వెదజల్లుతున్నది. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని బస్తీవాసులు వాపోయారు. నాలుగు నెలల నుంచి నరకం అనుభవిస్తున్నామని తెలిపారు. రేపు మాపు అంటూ తప్పించుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించి తొందరగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్పొరేటర్, ఎమ్మెల్యే ఈ విషయమై పట్టించుకొని పనులు తొందరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

ఇంకెప్పుడు సర్కిల్ - 14 డీసీ నియామకం

అబిడ్స్, ఫిబ్రవరి 16: జీహెచ్ఎంసీ సర్కిల్-14 డిప్యూటీ కమిషనర్ బదిలీ అయి వారం రోజులు కావస్తున్న నూతన డిప్యూటీ కమిషనర్ ను నేటికీ నియమించకపోవడంతో ఇన్‌చార్జి డీసీ తో ఇబ్బందులు తప్పడం లేదు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్. విద్యాధర్‌ను గత వారం కమిషనర్ బదిలీ చేశారు. ఆయన స్థానంలో కార్వాన్ డిప్యూటీ కమిషనర్ శశిరేఖకు అదనపు బాధ్యతలు అప్పగించారు ఆమెకు కార్వాన్ సర్కిల్ లో అధిక పని ఒత్తిడి ఉండడం వలన గోషామహల్ సర్కిల్ పై దృష్టి సారించలేని పరిస్థితి. దీంతో సర్కిల్ కార్యాలయంలోని అధికారులు సిబ్బంది ఆడింది ఆట పాడింది పాటగా సాగుతోంది. ఇందిరమ్మ ఇండ్ల సర్వే, ఆస్తి పన్ను వసూలు, ట్రేడ్ లైసెన్సుల రెన్యువల్, ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణల తోపాటు టౌన్ ప్లానింగ్ సిబ్బంది తక్కువగా ఉండడంతో ఆయా విభాగాలపై డిప్యూటీ కమిషనర్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించేలా చూడాల్సిన పరిస్థితి ఉంది. కానీ డిప్యూటీ కమిషనర్ విద్యాధర్ ను బదిలీ చేసినప్పటి నుంచి ఇప్పటివరకు పూర్తి సాయి డిప్యూటీ కమిషనర్ నియమించకపోవడం వలన పాలనపరమైన సమస్యలు ఎదురవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సందర్శన వేళల్లో కూడా అధికారులు అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు. సమస్యలను ఎవరికి విన్నవించుకోవాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వెంటనే డీసీని నియమించాలి..

నూతన డిప్యూటీ కమిషనర్‌ను వెంటనే నియమించాలని ప్రజలు, వివిధ పార్టీల నాయకులు కోరుతున్నారు. పూర్తిస్థాయి డిప్యూటీ కమిషనర్ నియమించడం వలన పాలనా సమస్యలు తలెత్తకుండా ఉంటాయని పేర్కొన్నారు. వెంటనే 14వ సర్కిల్ కు పూర్తిస్థాయి డిప్యూటీ కమిషనర్ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏడాదిలోనే బదిలీ...

సర్కిల్- 14 పరిధిలోని డిప్యూటీ కమిషనర్లు ఏడాది లోపే బదిలీ అవుతున్నారు. కరోనాకు ముందు రిచాగుప్త డిప్యూటీ కమిషనర్ గా ఉండగా ఆమెను ఏడాదిలోపే బదిలీ చేశారు. ఆమె స్థానంలో ఇన్చార్జి డీసీగా కపూర్ వినయ్ కపూర్ ను నియమించగా ఆయన కూడా ఏడాదికే బదిలీ అయ్యారు. ఆయన వెంటనే బి. శ్రీనివాసును నియమించగా ఆయనను కూడా సంవత్సర కాలంలోనే బదిలీ చేశారు. ఆయన స్థానంలో నియమితులైన నాయక్ ఏడాదిలో బదిలీ చేసి 2022 సంవత్సరంలో బాలయ్య నియమితులై పదవీ బాధ్యతలు స్వీకరించగా ఆయనను ఫిబ్రవరిలో బదిలీ చేసి విద్యాధర్ ను నియమించారు. ఆయనను కూడా ఏడాదిలోపే బదిలీ చేశారు. ఈ సర్కిల్ కార్యాలయం లో డిప్యూటీ కమిషనర్లను ఏడాది కూడా గడవకముందే బదిలీ చేస్తున్నారని విమర్శలు కూడా ఉన్నాయి.

నాలుగునాళ్ల జిందగీ వీడియో సాంగ్ విడుదల

రవీంద్రభారతి, ఫిబ్రవరి16 : వర్ధమాన సినీ రచయిత శ్రీ కీర్తి వేణు గోపాల్ రచించిన నాలుగునాళ్ల జిందగీ వీడియో సాంగ్ గీతావిష్కరణ కార్యక్రమం రవీంద్రభారతిలోని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరికృష్ణ వీడియో సాంగ్‌ను సీడీని ఆవిష్కరించి మాట్లాడుతూ.. మానవ జీవితం యొక్క గొప్పతనాన్ని ప్రేమ, ఆప్యాయతల అవసరాన్ని రచయిత శ్రీ వేణుగోపాల్ ఈ పాటలో ఆవిష్కరించారని, వారు ఇలాగే మరిన్ని మంచి పాటలు రాస్తూ ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆక్షాంక్షించారు. ఈ పాటకు సంగీతం శ్రీసాకేత సాయిరాం, డైరెక్టర్ వంశీకృష్ణ పరిమళ, కిమెరా, ఎడిటింగ్ బాలేందర్, నటులు కృష్ణ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. ఆదివారం కార్వాన్ నియోజకవర్గం లోని లక్ష్మీ నగర్ కాలనీవాసులు ఎమ్మెల్యే మహమ్మద్ కౌసర్‌ను కలిసి కాలనీలో సమస్యలు పరిష్కరించినందుకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్న సీరుద్దీన్ తో పాటు కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం,ఫిబ్రవరి 16

తెలంగాణ సాహిత్యానికి జీవం పోశారు

కవులను సత్కరించిన వక్తలు

రవీంద్రభారతి, ఫిబ్రవరి16 : తెలంగాణ సాహిత్యానికి జీవం పోసిన గొప్ప సాహితీవేత్తలు డాక్టర్ నందిని సిధారెడ్డి, డా. నాళేశ్వరం శంకరం, కందుకూరి శ్రీరాములు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ రాచయితల సంఘం-జంటన గరాలు, డా.నందిని సిధారెడ్డి, డా.నాళేశ్వరం శంకరం, కందుకూరి శ్రీరాములు ముగ్గురు కవుల సప్తతి సభలు ఆదివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. బైసా దేవదాసు సభా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వక్తలుగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, తెలంగాణ టీఎన్‌జీవో మాజీ అధ్యక్షుడు దేవీ ప్రసాద్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణలు విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నందిని సిధారెడ్డి, నాళేశ్వరం శంకరం, కందుకూరి శ్రీరాములు తెలంగాణ సాహిత్యానికి జీవం పోశారని, తెలంగాణలో రచయితలే లేరని హేళన చేసిన సమయంలో ఈ ముగ్గు రు కవులు తెలంగాణ సాహిత్యాన్ని ఉర్రూతలూగించారని తెలిపారు. తెలంగాణ ఉద్య మం సమయంలో తెలంగాణ కోసం అనేక సాహిత్య సభలను నిర్వహించి తెలంగాణ ప్రజలను, సాహిత్యవేత్తలను చైతన్యం చేశారని కొనియాడారు. వీళ్ల జీవితాలను ప్రజలకోసం అకితం చేశారని అన్నారు. విరాహత్ అలీ మాట్లాడుతూ.. ముగ్గురు కవులు 70ఏండ్ల వయస్సులో కూడా నవయువకులుగా తమ మేధో సంపతితో తెలంగాణ సాహిత్యాన్ని, తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసి, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన తెలంగాణ ఉద్యమానికి ఊపందించిన సాహితీవేత్తలలు అని కొనియాడారు. ఈ ముగ్గురు కవుల సాహిత్యం తెలంగాణ ప్రజలను ఆలోచింపజేశాయని, ఉద్యమం వైపు పయనింపజేశాయని పేర్కొన్నారు.70 సంవత్సరాలు నిండినా సాహిత్యమే ఊపిరిగా , కళమే గళంగా పనిచేస్తున్న నవయువకులను విరాహత్ అలీ కొనియాడారు. తెలంగాణ సాహిత్యానికే వన్నెతెచ్చిన మహనీయులని తెలిపారు. తెలంగాణ మంజీరా కవిత పేరుతో మెదక్ , సిద్దిపేట ప్రాంతంలో తెలంగాణ ఉద్యమాన్ని ఉర్రూతలూగించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.కొండపల్లి నిహారిక, బెల్లంకొండ సంపత్‌కుమార్, డా.తూర్పు మల్లారెడ్డి, గడ్డం సులోచన తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 16: తెలంగాణ రెవెన్యూ ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ ఉద్యోగుల అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నాంపల్లిలోని పోట్టి రాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కొనగాల మహేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్‌కుమార్‌గౌడ్ హాజరై క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ప్రభుత్వ పథకాల అమలులో రెవెన్యూ ఉద్యోగులు కీలమని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

అంబర్‌పేట, ఫిబ్రవరి 16 : రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకా రం.. విద్యానగర్-కాచిగూడ రైల్వేస్టేషన్‌ల మధ్య గుర్తు తెలియని (45) వ్యక్తిని రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో మరోవ్యక్తి..

అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం నం.1పైన 60 సంవత్సరాల వ్యక్తి చనిపోయి ఉన్నాడు. విష యం తెలుసుకున్న పోలీసులు మృ తదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. కోల మొఖం, కడుపు పై పుట్టుమచ్చ ఉందని తెలిపారు.

సీవీ రామన్ యంగ్.. అవార్డులు ప్రదానం

అవార్డులు ప్రదానం చేస్తున్న అతిథులు

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 16 : సామాజిక సేవా సంస్థ సుచరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 32వ సీవీ రామన్ టాలెంట్ సెర్చ్ పరీక్షలు జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివిధ పాఠశాలలో నిర్వహించగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల పంపిణీ ఆదివారం సాయంత్రం నాంపల్లి పబ్లిక్ గార్డెన్ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. వెయ్యి పాఠశాలల నుంచి పదివేల మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలలో గోల్డ్ మెడల్స్, నేషనల్ ర్యాంక్ మెడల్స్, రాష్ట్ర స్థాయి , జిల్లా స్థాయి మెడల్స్, అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. సుచరిండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వై.కిరణ్, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సినీ నటులు రావు రమేశ్ పాల్గొని విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని ఈ విధంగా యువతను ప్రోత్సహిస్తున్న సుచిరిండియా సేవలను వారు ప్రశంసించారు.

పట్టభద్రులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించుకుండా మోసం

రవీంద్రభారతి, ఫిబ్రవరి16 : మాల, మాదిగల మధ్య వర్గీకరణ చిచ్చుపెట్టి మాలలకు తీవ్ర ద్రోహం తలపెట్టిన కరీంనగర్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఓడించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించుకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేశాయని అన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ మళ్లీ నిరుద్యోగులను ఓట్లు అడుగుతుందని అన్నారు. సమస్యలు పరిష్కరించని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని దళితబహుజనులు చిత్తుగా ఓడించాలని ఆయన పిలుపు నిచ్చారు.

పోలీసు సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం

ఒత్తిడిలో నిత్యం విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది కోసం శ్రీకర హాస్పిటల్, మ్యాక్స్ విజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సైఫాబాద్ ఏసీపీ సంజయ్ కుమార్, సీఐ రాజశేఖర్, డీఐ సైదులుతో కలిసి ప్రారంభించారు. పోలీస్ సిబ్బందికి వివిధ పరీక్షలు నిర్వహించి వైద్య సూచనలు అందించారు.

– ఖైరతాబాద్, ఫిబ్రవరి 16

ఆరోగ్య కేంద్రానికి ఆదరణ కరువు..!

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 16: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పేద మహిళలకు పెద్ద దిక్కు గావున్న శ్రీరామ్ నగర్ ప్రసూతి దవాఖాన (పీహెచ్‌సీ) పూర్వ వైభవం కోల్పోయింది. దవాఖానలో సరిపడ గైనకాలజీ డాక్టర్లు లేకపోవడంతో గర్భిణులు ప్రసవ సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభు త్వ హయాంలో గర్భిణులకు ఇచ్చిన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటి ప్రోత్సాహకాలు ఇప్పుడు లేకపోవడంతో భారీగా ప్రసవాలు తగ్గిపోయాయి. నియోజకవర్గంలోని బోరబండ, రహ్మత్‌నగర్ డివిజన్‌లతో పాటు యూ సుప్ గూడ, ఎర్రగడ్డ, తదితర ప్రాంతాల్లోని గర్భిణులకు శ్రీరాంనగర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలోనే ప్రసూతి సేవలు అందుతాయి. వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఈ దవాఖానలో 30 పడకలు ఉన్నాయి. కాగా.. గతంలో నెలకు 100 నుంచి 120కు పైగా డెలివరీలు జరుగగా... ప్రస్తుతం 30 కంటే ఎక్కువ ప్రసవాలు జరగడం లేదు. గతంలో ఇక్కడ ముగ్గు రు గైనకాలజీ డాక్టర్లు ఉండగా.. ఇప్పుడు ఒక్కరు మాత్రమే ఉన్నారు. దీంతో సిజేరియన్ లేకుండా సాధారణ ప్రసవాలు జరిగే ఈ ప్రసూతి దవాఖానకు ఆదరణ కరువ య్యింది. గతంలో ఇక్కడ పెద్దఎత్తున ప్రసవాలు జరగడంతో ఈ దవాఖానను 100 పడకలకు విస్తరించాలని నాటి ప్రభుత్వం యోచించింది. నేడు డాక్టర్లు సరిగ్గా లేకపోవడంతో గర్భిణులు ప్రసూతి సేవల కోసం యాచించాల్సినపరిస్థితి నెలకొంది. ఇకనైనా ఉన్నతాధికారులు శ్రీరాం నగర్ సామజిక ఆరోగ్య కేంద్రానికి పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

అత్యవసర వాహనాలు కరువు..

శ్రీరాంనగర్ పీహెచ్‌సీలో గర్భిణులను తరలించేందుకు ప్రస్తుతం వాహన సౌకర్యం కూడా లేదు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ విరాళంగా ఇచ్చిన అంబులెన్స్ గత 3 నెలలుగా మూలకు పడింది. గత 7 సంవత్సరాలుగా సేవలందించిన ఈ అంబులెన్స్‌కు స్వల్ప మరమ్మతులు చేయించకపోవడంతో అత్యవసర సేవలకు వాహనం లేకుండా పోయింది. హైరిస్క్ గర్భిణులకు తప్పనిసరిగా సిజేరియన్ చేయాల్సిన కేసులను అంబులెన్స్‌లో అప్పటికప్పుడు నీలోఫర్ దవాఖానకు తరలిస్తారు. అయితే ఇటీవల 108 సేవలు కూడా అందుబాటులో లేకుండాపోవడంతో సరిగ్గా ప్రసవ సమయంలో తరలించే అత్యవసర వాహనం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇకనైనా వైద్య విధాన పరిషత్ అధికారులు దవాఖానకు పూర్వ వైభవం కల్పించి మెరుగైన ప్రసూతి సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

శ్రీరామ్‌నగర్ పీహెచ్‌సీలో గైనకాలజీ డాక్టర్ల కొరత.. భారీగా తగ్గిన ప్రసవాలు..

శ్రీరామ్‌నగర్ ప్రసూతి దవాఖాన

జాడ లేని కుటుంబ నియంత్రణ శిబిరాలు

కుటుంబ నియంత్రణపై వైద్యశాఖ అధికారుల పర్యవేక్ష ణ కొరవడడంతో జననాల వృద్ధి రేటు భారీగా పెరుగుతోంది. తెలంగాణ ప్రభుత్వ హయాంలో 3 నెలలకు ఒక సారి కు.ని శిబిరాలు నిర్వహించేవారు. అన్ని ప్రసూతి దవాఖానల్లో ఆ ధునిక పద్ధతిలో డబుల్ పంక్చర్ ల్యాప్రోస్కోపి ఆపరేషన్లు నిర్వహించేవారు. అయితే ఇటీవల కు.ని. శిబిరాల జాడే లే కుండాపోయింది. ఇటీవల నగరంలో ప్రసవాల కోసం ప్ర సూతి దవాఖానలకు వస్తున్నారు. అయితే వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గత కొంత కాలంగా ప్రసూతి కేంద్రాల్లో కు.ని శిబిరాల నిర్వహణ కానీ.. కుటుంబ నియత్రణ ఆపరేషన్లు కానీ చేయడం లేదు. నగరానికి ఇతర రాష్ట్రాల నుంచి పనులు చేసుకునేందుకు వచ్చే మహిళలకు అవగాహన కల్పించి కు టుంబ నియం త్రణ ఆపరేషన్లు చేసేవారు కరువయ్యారు.

గిరిజన హాస్టళ్లలో వసతులు కరువు..

తెలంగాణ స్టూడెంట్ సామాజిక ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లక్ష్మీనివాస్

బండ్లగూడ, ఫిబ్రవరి 16 : తెలంగాణ రాష్ట్రంలో గిరిజన హాస్టళ్లను ప్రభు త్వం గాలికి వదిలేసిందని తెలంగాణ స్టూడెంట్ సామాజిక ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లక్ష్మీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన రాజేంద్రనగర్‌లోని గిరిజన బాలుర హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అందిస్తున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమకు నాణ్యమైన భోజనం అందడం లేదని వివరించారు, వసతులు కూడా అంతంత మాత్రంగానే ఉ న్నట్లు వివరించా రు. అనంతరం లక్ష్మీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హాస్ట ల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందకపోవడంతో త్రీవ అస్వస్థతకు గురవుతున్నారని అన్నారు. తద్వారా విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చర్య లు తీసుకొని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించి.. విద్యాబుద్ధులు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ నాయకులు రఘుముదిరాజ్ సుధాకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు

రాజేంద్రనగర్‌లోని గిరిజన బాలుర హాస్టల్‌లో విద్యార్థులతో తెలంగాణ స్టూడెంట్ సామాజిక ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లక్ష్మీనివాస్